

# 25 లక్షల దీపకాంతులు.. 1,121 మందితో హారతులు

### గిన్నిస్ రికార్డులకెక్కిన అయోధ్య

అయోధ్య, అక్టోబర్ 30: దీపావళి సందర్భంగా దీపకాంతులతో అయోధ్య దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ సందర్భంగా రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. 8వ దీపోత్సవం సందర్భంగా ఏకకాలంలో అత్యధిక మంది హారతిలో పాల్గొనడం, అత్యధిక సంఖ్యలో నూనె దీపాల ప్రదర్శనతో అయోధ్య గిన్నిస్ రికార్డులకెక్కింది. ఏకకాలంలో 25 లక్షలకు పైగా ప్రమిదలలో దీపాలను వెలిగించారు. అలాగే 1,121 మంది వేదాచార్యులు హారతిని సమర్పించి రికార్డు నెలకొల్పారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ప్రవీణ్ పటేల్, నిశ్చల్ భారోత్‌లు బుధవారం సాయంత్రం ఈ రికార్డులను నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు యూపీ టూరిజం జిల్లా యంత్రాంగం, అయోధ్య, సరయు హారతి సమితులను అభినందించారు. అంతకు ముందు అత్యధికంగా 22,23,676 దీపాలు వెలిగించడం రికార్డుగా ఉండగా, ప్రస్తుతం 25,12,585 దీపాలతో దానిని అధిగమించారు. కాగా, రాముని జన్మస్థలమైన అయోధ్య మీదుగా ప్రవహించే సరయు నది ఒడ్డున 2017 నుంచి దీపావళికి ఒక రోజు ముందు ఈ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

## న్యూయార్క్‌లో స్కూళ్లకు దీపావళి సెలవు

### న్యూయార్క్ సిటీ చరిత్రలో మొదటిసారి

న్యూయార్క్, అక్టోబర్ 30: న్యూయార్క్ సిటీ చరిత్రలో మొదటిసారి దీపావళి నాడు అక్కడి స్కూల్స్ అన్నీ సెలవు ప్రకటించాయి. హిందువుల ముఖ్య పండుగ 'దీపావళి' పురస్కరించుకొని నవంబర్ 1న నగరంలోని స్కూళ్లన్నింటికీ సెలవు ఇచ్చినట్టు న్యూయార్క్ సిటీ డిప్యూటీ కమిషనర్ దిలీప్ చౌహాన్ వెల్లడించారు. ఈ ఏడాది జూన్‌లో మేయర్ కార్యాలయం దీపావళి రోజును పబ్లిక్ హాలిడేగా అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఇది స్కూళ్లకు కూడా వర్తింపజేసింది. 'న్యూయార్క్ నగరంలో సుమారుగా 11 లక్షల మంది విద్యార్థులున్నారు. స్కూల్‌కు వెళ్లాలా? గుడికి వెళ్లాలా? అన్న టెన్షన్ వాళ్లకు ఈ ఏడాది లేదు. దీపావళి వేడుకను సంతోషంగా గడుపుకునేందుకు సెలవు ప్రకటించాం. ప్రవాస భారతీయులు, వారి సంఘాల నాయకులు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు ఎన్నో ఏండ్లుగా చేస్తున్న డిమాండ్‌ను సిటీ మేయర్ ఎరిక్ ఆడమ్స్ నెరవేర్చారు' అని దిలీప్ చౌహాన్ చెప్పారు.

## ఖురాన్‌ను బిగ్గరగా పఠించడమూ నేరమే

### అఫ్గాన్‌లో మహిళలపై తాలిబన్ల ఆంక్షలు

కాబూల్, అక్టోబర్ 30: అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం మహిళలపై మరో ఆంక్ష విధించింది. ఖురాన్‌ను బిగ్గరగా పఠించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సమీపంలో మహిళలే ఉన్నా.. అలా పఠించకూడదని స్పష్టంచేసింది. అము టీవీ ఈ విషయాన్ని వెల్లడించింది. కాగా, 2021లో అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేపట్టినప్పటి నుంచి మహిళలపై పలు ఆంక్షలు విధిస్తూ వస్తున్నది. 'ప్రార్థన సమయంలో మహిళలు ఇతరులకు వినిపించేంత బిగ్గరగా మాట్లాడకూడదు. ఆమె స్వరం ఇతర మహిళలు కూడా వినకూడదు. అలా బిగ్గరగా పఠిస్తే దానిని అవమానంగా పరిగణిస్తాం' అని తాలిబన్ మంత్రి మహ్మద్ ఖలీద్ హనాఫీ పేర్కొన్నారు.

# శిలాద్రవంతో విద్యుత్తు!

- ఐస్‌లాండ్‌లో శాస్త్రవేత్తల సరికొత్త ప్రయత్నం
- మాగ్మా చాంబర్‌లోకి 2 కి.మీ లోతుతో బోర్లు
- శిలాద్రవం వేడితో విద్యుత్తు ఉత్పత్తి వ్యూహం



రెగ్జావిక్, అక్టోబర్ 30: భూమిపై వాతావరణ మార్పునకు కారణమవుతున్న శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంపై ఐస్‌లాండ్‌కు చెందిన శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. భూమి లోపలి శిలాద్రవంతో విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు సరికొత్త ప్రయత్నాన్ని ప్రారంభించారు. ఇందుకోసం భూమి లోపలికి దాదాపు రెండు కిలోమీటర్ల లోతుకు రెండు బోర్లు తవ్వుతున్నారు. ఒకవేళ ఈ ప్రయత్నం సఫలమైతే విద్యుత్తు ఉత్పత్తి రంగంలో ప్రపంచవ్యాప్తంగా పెను మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

**2009లో మొదలైన ప్రయత్నం**

ఐస్‌లాండ్‌లో అగ్నిపర్వతాలు ఎక్కువ. భూమిలోకి బోర్లు వేసి భూతాపం ద్వారా భూఉష్ణ విద్యుత్తు(జియోథెర్మల్ ఎనర్జీ) ఉత్పత్తిలో ఈ దేశం ముందుంది. ఇది ఐస్‌లాండ్ దిశను మార్చింది. ఈ దేశంలోని దాదాపు 90 శాతం ఇండ్లకు ఇప్పుడు ఈ విద్యుత్తే అందుతుంది. భూఉష్ణ విద్యుత్తు కారణంగానే ఒకప్పుడు ఐరోపాలోని పేద దేశాల్లో ఒకటిగా ఉన్న ఐస్‌లాండ్ ఇప్పుడు ధనిక దేశంగా మారింది. భూఉష్ణ విద్యుత్తు ఉత్పత్తిని మరింత విస్తృతం చేసేందుకు గాను ఈ దేశం మాగ్మా(శిలాద్రవం)పై దృష్టి సారించింది. భూమి లోపలి ఉష్ణోగ్రతల వల్ల కరిగిన రూపంలో మాగ్మా ఉంటుంది. మాగ్మా ఉండే ప్రదేశాన్ని మాగ్మా చాంబర్ అంటారు. 2009లో దేశ విద్యుత్తు సంస్థలోని బ్జర్ని పాల్సన్ అనే ఇంజినీర్ శిలాద్రవాన్ని మరింత క్షుణ్ణంగా అధ్యయనం చేసే లక్ష్యంతో ఐస్‌లాండ్‌లోని క్రఫ్ల అనే ప్రాంతంలో మొదటిసారిగా భారీ బోరు తవ్వారు. భూమి లోపల దాదాపు 2 కిలోమీటర్ల లోతులో మాగ్మా చాంబర్ ఉందని ఈ పరిశోధనలో తేలింది.

**ప్రాజెక్టు ఎలా చేపడతారు?**

ఇంతతక్కువ లోతులో ఇక్కడ తప్ప ఇంకెక్కడా మాగ్మా ఉండదని, అధ్యయనం కోసం ఇది సరైన ప్రాంతమని శాస్త్రవేత్తలు భావించారు. ఇప్పుడు మరింత అధునాతన సాంకేతికతతో 6,857 అడుగుల లోతుకు బోర్లు వేస్తున్నారు. అంటే, ప్రపంచంలోని అతి పెద్ద భవనమైన బుర్జ్ ఖలీఫాకు ఇది రెండున్నర రెట్లు ఎక్కువ. 2027 నాటికి మొదటి బోర్ వేయడం పూర్తవుతుంది. బోర్‌వెల్ ద్వారా మాగ్మాపై అధ్యయనం కోసం కొన్ని సెన్సార్లను పంపించడంతో పాటు మాగ్మా నమూనాలను సేకరిస్తారు. ఆ తర్వాత 2029లో పూర్తయ్యే ప్రణాళికతో రెండో బోర్ వేయనున్నారు. మాగ్మాలో దాదాపు వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఈ వేడి ఆవిరిని భూఉష్ణ శక్తిగా మార్చి విద్యుత్తును ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

### అపరిమిత విద్యుత్తు ఉత్పత్తి

సాధారణ జియోథర్మల్ విద్యుత్తు కంటే పది రెట్లు ఎక్కువ విద్యుత్తును శిలాద్రవంతో ఉత్పత్తి చేయవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 30 వేల ఇండ్లకు సరిపడే జియోథర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి 18 బోర్లు అవసరమవుతాయని, మాగ్మా విద్యుత్తు కోసం అయితే రెండు బోర్లు సరిపోతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఐస్‌లాండ్‌లో మాగ్మా విద్యుత్తు ప్రయత్నం సఫలమైతే మిగతా దేశాలూ ఈ ప్రయత్నం చేస్తాయని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుందని తెలిపారు.

## గూగుల్‌కు 2.5 డెసిలియన్ డాలర్ల జరిమానా

- సెర్చింజన్ దిగ్గజానికి రష్యా షాక్
- ప్రపంచంలోని మొత్తం కరెన్సీ కంటే ఇది అధికం

న్యూఢిల్లీ: సెర్చింజన్ దిగ్గజం గూగుల్‌కు రష్యా కోర్టు ఊహించని షాకిచ్చింది. క్రెమ్లిన్ అనుకూల మీడియా అవుట్‌లెట్ల చానళ్లను పునరుద్ధరించేందుకు నిరాకరించిన కేసులో 2.5 డెసిలియన్ డాలర్ల (రెండు అన్‌డెసిలియన్ రూబుళ్లు) జరిమానా విధించింది. ఇది ప్రపంచ జీడీపీ కంటే అధికం. అలాగే ప్రపంచంలో చలామణిలో ఉన్న మొత్తం సొమ్ము కంటే ఎక్కువ. ప్రపంచ బ్యాంకు లెక్క ప్రకారం ఈ మొత్తం దాదాపు 100 ట్రిలియన్ డాలర్లు. ఈ మొత్తాన్ని భారత కరెన్సీలో చెప్పాలంటే 8,40,88, 75,00,00,00,000 రూపాయలు. ఇప్పుడీ మొత్తాన్ని జరిమానాగా చెల్లించడం గూగుల్‌కే కాదు, భూమ్మీదున్న మరే సంస్థకు సాధ్యం కాదు.

# ఏఐతోనే 25% గూగుల్ కోడింగ్

- వెల్లడించిన సీఈఓ సుందర్ పిచాయ్
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు కష్టకాలం
- టెక్ కంపెనీల్లో పెరుగుతున్న ఏఐ
- స్కిల్స్ ఉంటేనే ఉద్యోగానికి భరోసా!

శాన్ ఫ్రాన్సిస్కో, అక్టోబర్ 30: కృత్రిమ మేధ(ఏఐ)పై వ్యక్తమైన ఆందోళనలు నిజమవుతున్నాయి. ఏఐ రాకతో ఉద్యోగాలు ఊడుతాయనే హెచ్చరికలు వాస్తవరూపం దాల్చుతున్నాయి. చిన్న ఐటీ సంస్థల నుంచి బహుళజాతి టెక్ కంపెనీల వరకు ఏఐపై ఆధారపడటం పెరుగుతున్నది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కోడింగ్ రాసే పనిని ఏఐ చేసి పెడుతున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు కష్టకాలమే అనేది స్పష్టమవుతున్నది. తాజాగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. 2024 మూడో త్రైమాసికంలో గూగుల్ పనితీరుపై ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గూగుల్ కొత్త కోడ్‌లో 25 శాతం కృత్రిమ మేధ ద్వారానే జనరేట్ చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే, తర్వాత ఈ కోడ్‌ను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కోడర్లు పరిశీలిస్తున్నట్టు చెప్పారు.



ఏఐ స్కిల్స్ ఉంటేనే ఫ్యూచర్ సేఫ్

గూగుల్ మాత్రమే కాదు ఇంకా అనేక కంపెనీలు క్రమంగా ఏఐ వినియోగాన్ని పెంచుతున్నాయి. గత ఏడాది కాలంగా అనేక కంపెనీలు భారీగా ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఆర్థిక కారణాల వల్లనే లేఆఫ్‌లు అని చెప్తున్నప్పటికీ, ఏఐ వినియోగం కూడా ఒక కారణమనే అభిప్రాయాలు ఉన్నాయి. ఏఐ వినియోగంతో ఉద్యోగాల కోత ప్రభావం ఎక్కువగా రొటీన్ కోడింగ్ పనులు చేసే ఎంట్రీ లెవల్, మిడ్ లెవల్ ఉద్యోగులపై పడుతుంది. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలు భద్రంగా ఉండాలంటే ఏఐ నైపుణ్యాలు నేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఉచిత బస్సుకు మంగళం!

మొదటిపేజీ తరువాయి...

శాఖ మంత్రి రామలింగారెడ్డితో త్వరలోనే సమావేశమై చర్చిస్తానని చెప్పారు.

**ఉచితాలు అమలు చేయలేక సతమతం**

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారెంటీల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఏడాదిలోనే పార్లమెంటు ఎన్నికలు ముంచుకురావడంతో గెలిచిన వెంటనే పథకాలను అమలు చేయడం ప్రారంభించింది. ఇందులో భాగంగా 'శక్తి' పేరుతో గత ఏడాది జూన్ 11 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తున్నది. అయితే, ఉచిత పథకాల వల్ల రాష్ట్రంపై విపరీతమైన ఆర్థిక భారం పడుతున్నది. అభివృద్ధి పనులు ఆగిపోయాయి. దీంతో ఇప్పటికే పన్నులను పెంచుతూ ప్రజలపై భారాన్ని వేస్తున్నది. గ్యారెంటీల వల్ల అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారు ప్రకటించిన పరిస్థితులు ఉన్నాయి.

**భారం తగ్గించుకునే ప్రయత్నమే!**

ఉచితాలపై కాంగ్రెస్ ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ పార్లమెంటు ఎన్నికల్లో ఈ పథకాలు ఓట్లు కురిపించలేదు. దీంతో ఉచితాలు ఆపేయాలని, సమీక్ష నిర్వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను బహిరంగంగానే కోరుతూ వస్తున్నారు. దీంతో ఒక్కో పథకానికి కత్తెర పెట్టేందుకు సర్కారు సమాయత్తమవుతున్నట్టు కనిపిస్తున్నది. మొదటి వేటు ఉచిత బస్సు పథకంపై పడే అవకాశం ఉంది. ఈ పథకం వల్ల ప్రభుత్వంపై ఏడాదిన్నరలో రూ.7,507.35 కోట్ల భారం పడింది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ఆపేసి మహిళలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

# 'చెట్టు తల్లి'కి కష్టమొచ్చే!

- ప్రమాదంలో వృక్షజాతులు
- అంతరించే స్థితికి 38 శాతం
- ఐయూసీఎన్ తాజా నివేదిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): పర్యావరణాన్ని పరిరక్షించి, జీవ వైవిధ్యాన్ని కాపాడి, మనిషికి ఆవాసంగా, ఆహారంగా, ఆయువుగా మారిన 'చెట్టు తల్లి' ప్రమాదం అంచుకు చేరింది. ప్రపంచంలోని 38 శాతం వృక్షజాతులు అంతరించిపోయే స్థితికి చేరుకొన్నాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) ఆందోళన వ్యక్తం చేసింది. కాప్-16 సదస్సులో బొటానిక్ గార్డెన్స్ కన్జర్వేషన్ ఇంటర్నేషనల్ (బీజీసీఐ)తో కలిసి ఈ మేరకు నివేదికను వెలువరించింది. నివేదిక రూపకల్పనలో వెయ్యి మంది శాస్త్రవేత్తలు పాలుపంచుకొన్నారు.

**అంతరించిపోవడానికి కారణాలు**

వ్యవసాయం కోసం అడవుల్లోని చెట్లను తొలగించడం, వంటచెరుకుతో పాటు ఇంటి నిర్మాణం కోసం చెట్లను నరికేయడం, వ్యాధులు, తెగుళ్లు, కార్చిచ్చులు వంటి అంశాలు వృక్షజాతులు అంతరించిపోవడానికి ప్రధాన కారణంగా నివేదిక అభిప్రాయపడింది.

**అంతరిస్తే అంతమే**

వృక్షజాతులు అంతరించిపోతే జీవ వైవిధ్యం దెబ్బతింటుందని, పర్యావరణ చక్రం అస్తవ్యస్తంగా మారి రుతువులు గతి తప్పొచ్చని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. చెట్లపై ఆధారపడి నివసించే లక్షలాది పక్షులు, క్రిమికీటకాలు, జంతువుల అస్థిత్వానికే ముప్పు వాటిల్లవచ్చని హెచ్చరించింది. భూమి మీద చెట్ల సంఖ్య తగ్గిపోతే మట్టి కొట్టుకుపోయి నగరాలపై వరదలు ముంచెత్తవచ్చని, ఇది ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయవచ్చని తెలిపింది.

**అంతరించి పోతున్న వృక్ష జాతుల్లో ప్రధానమైనవి**
మగ్నోలియాస్, ఓక్స్, మ్యాపిల్స్, ఎబోనీస్ వృక్షజాతులు





## తూర్పు లద్దాఖ్‌లో బలగాల ఉపసంహరణ

### నేడు మిఠాయిలు పంచుకోనున్న భారత్, చైనా సైనికులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30: తూర్పు లద్దాఖ్‌లోని దెమ్‌చోక్, దెప్సాంగ్ ప్రాంతాల్లో భారత్, చైనా బలగాల ఉపసంహరణ పూర్తయినట్టు భారత ఆర్మీ వర్గాలు బుధవారం తెలిపాయి. ఇరు దేశాల మధ్య జరిగిన దౌత్య ఒప్పందంలో భాగంగా అక్టోబర్ 25న బలగాల ఉపసంహరణ ప్రారంభమైనట్టు చెప్పాయి. ఈ ప్రాంతాల్లో త్వరలోనే గస్తీ ప్రారంభం కానున్నట్టు వెల్లడించాయి. గురువారం దీపావళి సందర్భంగా ఇరు దేశాల సైనికులు మిఠాయిలు పంచుకుంటారని తెలిపాయి. బలగాల ఉపసంహరణ తర్వాత పురోగతి, పెట్రోలింగ్ నిర్వహణ పద్ధతులపై స్థానికంగా కమాండర్ల స్థాయిలో జరిగే చర్చల్లో నిర్ణయం తీసుకోనున్నట్టు వెల్లడించాయి. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య జరిగిన భీకర ఘర్షణతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తలెత్తాయి. దీంతో దెమ్‌చోక్, దెప్సాంగ్ ప్రాంతాల్లో ఇరు దేశాలు బలగాలను మోహరించాయి.



వరద ధాటికి స్పెయిన్ పట్టణం వాలెన్సియాలోని ఓ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ల ముందుకు కొట్టుకువచ్చిన కార్లు

# స్పెయిన్‌లో వరద బీభత్సం

- నదులను తలపిస్తున్న గ్రామాలు
- 72 మంది మృతి.. పలువురికి గాయాలు
- వరదలో కొట్టుకుపోయిన కార్లు

బార్సిలోనా, అక్టోబర్ 30: యూరప్ దేశం స్పెయిన్ ప్రకృతి ప్రకోపానికి గురైంది. ఇంతకుముందెన్నడూ లేనంత స్థాయిలో భారీ వర్షాలు, వరదలు ఆ దేశ తూర్పు, దక్షిణ ప్రాంతాన్ని ముంచెత్తాయి. అనేక గ్రామాలు నదులను తలపిస్తున్నాయి. రెండు రోజులుగా ప్రజలు ఇండ్లల్లో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తున్నది. పలు పట్టణాలు, గ్రామాల్లో వరద ధాటికి కార్లు, పెద్ద పెద్ద కంటైనర్లు సైతం కొట్టుకుపోయాయి. వివిధ చోట్ల జరిగిన ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య బుధవారం నాటికి 72కు చేరుకుందని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చునని అత్యవసర సేవల విభాగం వెల్లడించింది. అనేక పట్టణాల్ని వరద నీరు ముంచెత్తిందని, ప్రమాదం అంచున ఉన్నాయని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తెలిపారు. 'ఎలుకల మాదిరి మేమంతా ఇండ్లల్లో చిక్కుకుపోయాం. వీధుల్లో నీరు మూడు మీటర్ల ఎత్తుకు చేరుకుంది' అని వాలెన్సియా పట్టణ మేయర్ రికార్డో గాబ్లడాన్ చెప్పారు.

## మహారాష్ట్ర బరిలో 150 మంది రెబల్స్

### మహాయుతి, ఎంవీఏ కూటములకు తిరుగుబాటుదారుల బెడద

ముంబై, అక్టోబర్ 30: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగియగా, రెండు ప్రధాన రాజకీయ కూటముల నుంచి 150 మందికిపైగా రెబల్స్ బరిలోకి దిగారు. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి, కాంగ్రెస్ నాయకత్వంలోని ఎంవీఏ కూటముల పక్షాన అధికార అభ్యర్థులకు వ్యతిరేకంగా రెబల్స్ నామినేషన్లు వేశారు. మహాయుతి పక్షాన అత్యధికంగా 80 మంది రెబల్స్ బరిలోకి దిగారు. నామినేషన్ల ఉపసంహరణకు నవంబర్ 4 వరకు గడువు ఉండటంతో రెబల్స్‌ను బుజ్జగించేందుకు ఆయా పార్టీలకు వారం రోజుల గడువు లభించింది. అసెంబ్లీలోని మొత్తం 288 స్థానాలకు అభ్యర్థులను పోటీకి దింపామని రెండు కూటములూ ప్రకటించాయి.

## మాజీ భార్యలు, పిల్లల కోసం 300 కోట్ల విల్లా

### కొనుగోలు చేసిన మస్క్

న్యూఢిల్లీ: బిలియనీర్ ఎలాన్ మస్క్ తన 11 మంది పిల్లలు, వారి తల్లులను ఒక చోట చేర్చేందుకు 35 మిలియన్ల(దాదాపు రూ. 294 కోట్లు)తో విశాలమైన భవనం కొనుగోలు చేశారు. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో 14,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భవనం, దాని పక్కనే ఆరు బెడ్రూంలు కలిగిన మరో ఇంటిని మస్క్ కొనుగోలు చేసినట్టు 'న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. ఈ ఇంటి వల్ల పిల్లలు ఒకరికొకరు తోడుగా ఉంటారని, వారితో గడిపేందుకు తనకు సమయం దొరుకుతుందని మస్క్ భావిస్తున్నారట.

## దర్శన్‌కు బెయిల్

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు రేణుకా స్వామి హత్య కేసులో కర్ణాటక హైకోర్టు బుధవారం ఉపశమనం కల్పించింది. వెన్నెముక శస్త్ర చికిత్స కోసం ఆయనకు ఆరు వారాల తాత్కాలిక బెయిలు మంజూరు చేసింది. పాస్‌పోర్టును ట్రయల్ కోర్టుకు అప్పగించాలని, సాక్ష్యాలను తారుమారు చేయరాదని షరతు విధించింది. వారంలోగా వైద్య నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసులో ఆయన జూన్ 11న అరెస్టయ్యారు. ప్రస్తుతం బళ్లారి జైలులో ఉన్నారు.

## మా దేశంలో దాడులకు అమిత్ షా ఆదేశాలు

### మరోసారి తీవ్ర ఆరోపణలు చేసిన కెనడా

ఒట్టావా, అక్టోబర్ 30: కెనడా మరోసారి భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేసింది. సిక్కు వేర్పాటువాదులు లక్ష్యంగా తమ దేశంలో హింసాత్మక దాడులు, బెదిరింపులకు భారత హోం మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారని కెనడా ఉన్నతాధికారి ఒకరు ఆరోపించారు. ఈ మేరకు డిప్యూటీ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ నేషనల్ సెక్యూరిటీ కమిటీ పార్లమెంట్ సభ్యులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. కాగా, ట్రూడో రక్షణ సలహాదారు నథాలీ డ్రౌయిన్ మంగళవారం కమిటీ ముందు మాట్లాడుతూ కెనడాలో ఉన్న దౌత్యవర్గాల ద్వారా భారత్ భారతీయులు, కెనడా పౌరుల వివరాలు సేకరించినట్టు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు.

# సిద్ధరామయ్యపై పరువునష్టం దావా

### కోర్టుకెక్కిన ముడా స్కామ్ ఫిర్యాదుదారు

తనను బ్లాక్‌మెయిలర్ అన్నారని ఆరోపణ

బెంగళూరు, అక్టోబర్ 30: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై అడ్వకేట్ టీజే అబ్రహం బుధవారం పరువు నష్టం దావా వేశారు. సిద్ధరామయ్య తనను బ్లాక్‌మెయిలర్ అని నిందించారని ఆరోపిస్తూ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యపై విచారణకు అనుమతించాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఫిర్యాదు చేసిన వారిలో అబ్రహం ఒకరు. ఈ సందర్భంగా అబ్రహం మాట్లాడుతూ... 'నా మీద ప్రతీకారం తీర్చుకోవాలనే ఉత్సాహంతో సిద్ధరామయ్య నన్ను బ్లాక్‌మెయిలర్ అని, నాకు చెడు చరిత్ర ఉందని బహిరంగంగా వ్యాఖ్యానించారు. మీరు(సిద్ధరామయ్య) చట్టవిరుద్ధంగా ముడా నుంచి 14 స్థలాలను పొంది నన్ను బ్లాక్‌మెయిలర్ అంటున్నారు. నేను మీపై కోర్టులో పరువు నష్టం దావా వేశాను. మీరు ఎలా తప్పించుకుంటారో చూస్తా' అని వ్యాఖ్యానించారు.

**ముడాలో భారీ అవినీతి: బీజేపీ ఎంపీ**

ముడా కుంభకోణం చాలా లోతైనదని,



ముడాలో భారీ ఎత్తున అవినీతి జరిగిందనే విషయం రోజురోజుకూ స్పష్టమవుతున్నదని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లహర్ సింగ్ సిరోయా పేర్కొన్నారు. బుధవారం ఆయన బెంగళూరులో మాట్లాడుతూ... ముడా స్కామ్ కేవలం సిద్ధరామయ్య కుటుంబానికి 14 స్థలాల కేటాయింపునకు మాత్రమే పరిమితం కాదని, ఈ కుంభకోణం చాలా లోతైనదనే తన అనుమానాలు నిజం అవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముడా కుంభకోణంలో ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ, అప్పటి ముడా డిప్యూటీ కమిషనర్ కుమార నాయక్ పాత్ర ఉందని ఆరోపించారు.

## కొవిడ్‌ను మించిన ప్రాణాంతక వ్యాధి క్షయ

### ప్రపంచంలో 26 శాతం కేసులు భారత్‌లోనే

న్యూఢిల్లీ : ప్రాణాంతక అంటు వ్యాధుల్లో కొవిడ్-19ను క్షయ వ్యాధి మించిపోయింది. 2023లో రికార్డు స్థాయిలో 82 లక్షల కొత్త కేసులు నిర్ధారణ అయ్యాయి. 2022లో వీటి సంఖ్య 75 లక్షలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)కు చెందిన ప్రపంచ క్షయ వ్యాధి నివేదిక, 2024 ఈ వివరాలను వెల్లడించింది. ప్రపంచంలో 2023లో నమోదైన కేసుల్లో 26 శాతం కేసులు మన దేశంలోనే ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఇండోనేషియా (10 శాతం), చైనా (6.8 శాతం), ఫిలిప్పీన్స్ (6.8 శాతం), పాకిస్థాన్ (6.3 శాతం) ఉన్నాయి. క్షయ వ్యాధి సంబంధిత మరణాల సంఖ్య 2022లో 13.2 లక్షలు కాగా, 2023లో కాస్త తగ్గి, 12.5 లక్షలుగా నమోదైంది.



# బొమ్మలే మా పిల్లలు!

### జపాన్‌లో గ్రామస్తుల వినూత్న ఆలోచన

టోక్యో, అక్టోబర్ 30: జనాభా సంఖ్య తగ్గిపోతుండటంపై తీవ్ర ఆందోళనలో ఉన్న జపాన్‌లోని ఒక గ్రామం వారు పిల్లలు లేని లోటును తీర్చుకునేందుకు ఒక వినూత్నమైన ఆలోచన చేశారు. 60 మంది కన్నా తక్కువ జనాభా ఉన్న ఇచ్చినినో అనే కుగ్రామంలో ఒక బిడ్డ మాత్రమే ఉంది. మిగిలిన వారంతా పెద్ద వారే. దాంతో పిల్లలు లేని లోటును కన్పించకుండా చేయడానికి వారు పిల్లల సైజులో బొమ్మలను తయారు చేయించి గ్రామంలోని వివిధ ప్రదేశాలలో ఉంచారు. ఆ గ్రామంలోకి అడుగుపెట్టగానే సైకిల్ తొక్కుతున్నట్టు, ఊయల ఊగుతున్నట్టు, తోటి పిల్లలతో ఆటలాడుకుంటున్నట్టు వివిధ రూపాలలో పిల్లల బొమ్మలు దర్శనమిస్తాయి. 'ఈ బొమ్మలే మా పిల్లలు' అంటూ 88 ఏండ్ల వృద్ధుడొకరు పేర్కొన్నారు. ఇదివరకు తమ కుమారులు, కుమార్తెల సంతానంతో గ్రామం కళకళలాడేదని, కానీ చాలామంది ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిపోవడంతో గ్రామంలో పిల్లల సందడి కరవైందని, దాంతో బొమ్మలనే వారిలా తయారు చేసి ఆ లోటును తీర్చుకుంటున్నట్టు మరో గ్రామస్తుడు తెలిపారు.